ప్రజాశక్తి
శనివారం 25 అక్టోబరు 2025
5
శ్రీకాకుళం



2న కూర్మనాథ స్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి - గార

శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామి తెప్పోత్సవాన్ని నవంబరు రెండో తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నరసింహ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెప్పోత్సవం ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి ఆలయం ఎదురుగా ఉన్న శ్వేత పుష్కరిణి వద్ద ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు అధిక సంఖ్యలో తెప్పోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ప్రైవేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యం

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు 324 కేసుల నమోదు
- 175 మంది ఆపరేటర్లు అపరాధ రుసుములు చెల్లించని వైనం
- తనిఖీలకు సరిపడా సిబ్బందిని నియమించని ప్రభుత్వం

కాసుల సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న ప్రైవేట్ యాజమాన్యాలను ప్రజల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. రవాణా చట్టం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. తనిఖీల్లో పట్టుబడుతున్నా అపరాధ రుసుము సైతం చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి ఉన్న వారే బస్సులను నడుపుతుండడంతో, పై నుంచి ఆదేశాలు వస్తే గానీ జిల్లా అధికారులు తనిఖీలకు సాహసించలేకపోతున్నారు. అక్కడక్కడా తనిఖీలు చేస్తున్నా మొక్కుబడిగానే ఉన్నాయి. మరోవైపు తనిఖీలకు సరిపడా సిబ్బందిని నియమించకపోవడంపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



శ్రీకాకుళం నగరంలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు సిబ్బంది

జిల్లా నుంచి ఉపాధి, ఉద్యోగ అవసరాలతో పాటు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, రైళ్లు తగినన్ని లేకపోవడంతో అధిక శాతం మంది బస్సుల పైనే ఆధారపడుతున్నారు. దీంతోపాటు జిల్లాలో వలసలు అధికంగా ఉండడంతో వలస కూలీలు సైతం అధిక సంఖ్యలో బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఆర్‌టిసి తగినన్ని బస్సులు నడపలేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్న బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఏటా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన వాటిలో ప్రస్తుతం రాష్ట్ర పరిధిలో తిరిగేందుకు 18 ప్రైవేట్ బస్సులు, ఒక ఆలిండియా పర్మిట్ పొందిన బస్సు తిరుగుతోంది. ఇవికాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఆపరేటింగ్ చేస్తూ నడుస్తున్న బస్సులు వంద వరకు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు నరసన్నపేట, టెక్కలి, పలాస, ఆమదాలవలస, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి ప్రైవేట్ బస్సులు నిత్యం తిరుగుతున్నాయి. జిల్లా నుంచి విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నాయి.

యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన

ప్రైవేట్ టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు సంబంధించి రవాణా చట్టంలో పేర్కొన్న నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. వీటిలో పండగ సీజన్‌లో అధిక ఛార్జీలను వసూలు చేయడం, సరైన పత్రాలు లేకపోవడం, అతి వేగం, ప్రమాదకర డ్రైవింగ్ వంటి అంశాలపై అధికారులు అనేక సందర్భాల్లో కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. డ్రైవర్లకు యూనిఫారం, బస్సులకు డేజలింగ్ లైట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం వంటి వాటితో పాటు చిన్న చిన్న అంశాలను సైతం యాజమాన్యాలు విస్మరిస్తున్నాయి. వీటిపై జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 324 కేసులు నమోదు చేశారు.

అపరాధ రుసుమూ ఎగవేతే

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు చేపడుతున్న తనిఖీల్లో అనేక లోపాలు బయటపడుతున్నాయి. వాటిపై అధికారులు అపరాధరుసుము విధిస్తున్నా చెల్లించకుండా ఎగవేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు పలురకాల ఉల్లంఘనలపై 324 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి అపరాధ రుసుము విధించగా ఇప్పటికీ 175 మంది ఆపరేటర్లు చెల్లించలేదు. అధికారులు తనిఖీల్లో గుర్తించి లోపాలను యజమాన్యాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అవే తప్పిదాలు పునరావృతమవుతున్నాయి.

తనిఖీలకు సిబ్బంది కొరత

ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వమూ ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమాన్యాలను కట్టడి చేసేందుకు రవాణాశాఖను పటిష్ఠం చేయాల్సి ఉండగా, ఆ శాఖకు సరిపడా సిబ్బందిని నియమించడం లేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించే మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవిఐ), అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎఎంవిఐ) పోస్టులను సకాలంలో భర్తీ చేయడం లేదు. జిల్లాలో 18 మంది ఎఎంవిఐలు పనిచేయాల్సిన చోట ఒక్కరే పనిచేస్తున్నారు. అదేవిధంగా జిల్లాకు 11 మంది ఎంవిఐలను కేటాయించగా, పది మందే పనిచేస్తున్నారు. వారిలో జిల్లాల విభజన తర్వాత విశాఖకు ఇద్దరిని, విజయనగరం, అనకాపల్లికి చెరొకరిని పంపేశారు. మిగిలిన ఆరుగురిలో ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి కార్యాలయాల్లో ముగ్గురు, ఎచ్చెర్ల ఆర్‌టిఒ కార్యాలయంలో మరో ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాకు ఆర్‌టిఒ (రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్) లేకపోవడం రవాణా శాఖ దుస్థితికి అద్దం పడుతోంది

నిరంతరం తనిఖీలు చేస్తున్నాం



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన యజమానులపై కేసులు నమోదు చేస్తున్నాం. అపరాధ రుసుములూ విధిస్తున్నాం. ముఖ్యంగా సంక్రాంతి, దసరా సీజన్‌ల్లో అధిక ఛార్జీల వసూలుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం.

- ఎ.విజయసారథి,
జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టు

టీచర్లకు 'టెట్' సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - నరసన్నపేట

సర్వీస్‌లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేయడం సరికాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి అన్నారు. నరసన్నపేటలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీనియర్ ఉపాధ్యాయులు అప్పటికే ఉద్యోగంలోకి రావడానికి అవసరమైన విద్యార్హతలు కలిగి, పోటీ పరీక్షల్లో విజయం సాధించి నియామకం పొందారని తెలిపారు. వాళ్ల బోధనా సామర్థ్యాన్ని అప్పుడే ప్రభుత్వం పరీక్షించి అంగీకరించిందన్నారు. ఆర్‌టిఇ 2009 చట్టం అమలు 2010 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జరిగిందన్నారు. చట్టం రూపొందించక ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు చట్టం వర్తింపజేయడం సమంజసం కాదన్నారు. ఏళ్ల తరబడి వృత్తిలో అనుభవం, అంకితభావం, తరగతి గదిలో పొందిన ప్రాక్టికల్ పరిజ్ఞానం ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు విద్యా బోధన చేయలేరా అని ప్రశ్నించారు. అనుభవజ్ఞులైన వాళ్లకి టెట్ తప్పనిసరి చేయడం ఎందుకుని, వారి బోధన వల్ల విద్యార్థులకు ఏమైనా నష్టం వాటిల్లిందా, విద్యా ప్రమాణాలు తగ్గిపోయాయా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టెట్ ఉన్న ఉపాధ్యాయుల కన్నా పదేళ్ల అనుభవం ఉన్న సీనియర్లు బోధనలో పిల్లల మనస్తత్వం అర్థం చేసుకోవడంలో, పాఠ్యాంశం అందించడంలో ఎంతో దిట్ట అని అన్నారు. అలాంటి సీనియర్లను మళ్లీ పరీక్షల పేరుతో మానసిక ఆందోళనకు గురిచేయడం, సమయాన్ని వృథా చేయడం, బోధనా సమయాన్ని తగ్గించడం తప్ప మరే ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు ఇప్పటికే దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఆర్‌టిఇ చట్టం సెక్షన్ 23 (2) ఎమెండ్‌మెంట్ చేయాలంటే ఉభయ సభలు ఆమోదం పొందిన బిల్లును సుప్రీంకోర్టుకి నివేదిస్తే దీని నుంచి మినహాయింపు పొందవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఇళ్లు ప్రభుత్వ ధ్యేయం

- ఐదో తేదీ లోగా అర్హులు దరఖాస్తు చేసుకోవాలి
- ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గల క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి పక్కా ఇళ్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకనుగుణంగా అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి త్వరలో నూతన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఇళ్లు లేని నిరుపేదలు ఆయా సచివాలయాల్లో వచ్చే నెల ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకొని, గృహ నిర్మాణ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ అధికారి రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీ పరిధిలోని ఇంటి యజమానులకు డిమాండు నోటీసు జారీ చేసి ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టిసారించాలని మంత్రి అచ్చెన్నాయుడు పంచాయతీ అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసెంబరులోగా ప్రతి ఇంటి విలువ లెక్కించి సమగ్ర ఇంటి పన్ను వివరాలు సేకరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కొత్తమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.ఐదు కోట్లు, మండలంలోని నర్సింగపల్లి వద్ద రూ.3.75 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. జూనియర్ కళాశాల మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. నూతనంగా గ్రంథాలయ భవన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని, శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ షాపింగ్ స్థానంలో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నవంబర్ 3న అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

క్వాంటమ్ క్లిష్టం కాదు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల



సాయి శంకర్

క్వాంటమ్ గణన సూత్రాలు క్లిష్టంగా అనిపించినా, సరైన పద్ధతిలో నేర్చుకుంటే అవి సులభంగా అర్థమవుతాయని ఐబిఎం క్వాంటమ్ పరిశోధక శాస్త్రవేత్త పి.సాయి శంకర్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో నిర్వహిస్తున్న 'క్విసిక్ ఫాల్ ఉత్సవం-2025'లో నాలుగో రోజు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి సంక్లిష్ట క్వాంటమ్ సూత్రాలను సాధారణ జీవితంలోని ఉదాహరణలతో పోల్చి వివరించిన ఆయన, భవిష్యత్ సాంకేతికతలో క్వాంటమ్ కీలకపాత్ర పోషిస్తుందని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ పరిశోధనలతో పాటు భారత ప్రభుత్వ జాతీయ క్వాంటమ్ లక్ష్యం, అమరావతి క్వాంటమ్ లోయ వంటి ముఖ్యమైన ప్రాజెక్టుల గురించి వివరించి, దేశ సాంకేతిక ప్రగతికి ఈ ప్రాజెక్టులు దిశానిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. సీడ్యాక్-హైదరాబాద్ జ్ఞాన సహకారి అభిజిత్ తేజ్, 'దేశీయ క్వాంటమ్ గణన అనుకరణ సాధన సంపత్తి'పై ఆచరణాత్మక ప్రదర్శన నిర్వహించి, క్వాంటమ్ రంగంలో దేశం సాధిస్తున్న పురోగతిని వివరించారు. ఐబిఎం క్వాంటమ్ రాయబారి సౌమ్య రంజన్ స్వైన్ క్వాంటమ్ అల్గోరిథమ్‌లపై ఉపన్యాసం ఇచ్చి, విద్యార్థులకు అన్వయాత్మక దృక్పథం కల్పించారు. డేటా టెక్ ప్రధాన సాంకేతిక అధికారి డాక్టర్ జ్ఞాన్ యల్లా క్వాంటమ్ విద్యుత్ వలయాలు, కొలతలు, కార్యక్రమ రచన సాధనాలను వివరించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ, పరిపాలన అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి డాక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం

ప్రజాశక్తి - కొత్తూరు

రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు, పంపిణీ నెట్‌వర్క్‌లు అధికార పార్టీ నేతల అండదండలతోనే నడుస్తున్నాయని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ప్రభుత్వం కేవలం ఆదాయంపై దృష్టిసారించి ప్రజల ఆరోగ్యాన్ని, సామాజిక శ్రేయస్సును పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి మూలలో బెల్టుషాపులు వెలిశాయని... దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాచోట్ల దొరికిన నకిలీ మద్యం తయారీ కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నాసిరకం, కల్తీ మద్యం విక్రయాల వల్ల అనేకమంది నిరుపేదలు అనారోగ్యాల పాలవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని తెలిపారు. ఈ ప్రాణ నష్టానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం కుంభకోణంలో నిజాలు బయటపడుతుంటే, అధికార పార్టీ నేతలు కేసును తప్పుదోవ పట్టించడానికి, రాజకీయ ప్రత్యర్థులపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మద్యం అమ్మకాలను డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా బెల్టు షాపులు, పర్మిట్ రూముల్లో యథేచ్ఛగా అక్రమ మద్యం, నకిలీ మద్యం అమ్మకాలు సాగుతున్నాయని తెలిపారు. మద్యం నియంత్రణ అనేది ఎన్నికలకు ముందు టిడిపి ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటని, నేడు ఆ హామీని గాలికొదిలేసిందని విమర్శించారు. కల్తీ మద్యం సేవించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా, మరణాలు సంభవిస్తున్నా ఈ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. అక్రమ, కల్తీ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం, మృతి చెందిన వారి తొలగింపు, తప్పుల్లేని ఓటరు జాబితా లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదుపై సూచనలు, సలహాలు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరు రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదు, తొలగింపులపై సమాచారం అందించాలన్నారు. రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఫారం-6, 7, 8 సమాచారం తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల సూచనలతోనే పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమని చెప్పారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పారదర్శక జాబితా క్షేత్రస్థాయిలో సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, జనసేన నాయకులు అర్జున్ కుమార్, సిపిఎం నాయకులు ఎం.గోవర్ధనరావు, కాంగ్రెస్ నాయకులు ఈశ్వరి, బిజెపి, బిఎస్‌పి నాయకులు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

కోర్టు కానిస్టేబుళ్లు పోలీసు వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న కోర్టు కానిస్టేబుళ్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కోర్టు కానిస్టేబుళ్ల విధులు, ముఖ్యమైన కేసుల్లో అభియోగ పత్రాల దాఖలు, సిసి నంబర్లు, సమన్లు, వారెంట్ల అమలు, న్యాయస్థానాలకు హాజరుపై దిశానిర్దేశం చేశారు. కోర్టు కానిస్టేబుళ్ల సమయపాలన, నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతి కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్ష్యాలు సమయానికి కోర్టులకు చేరేలా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. జిల్లాలోని ముఖ్యమైన కేసుల్లో అభియోగ పత్రాలు సమయానికి దాఖలు చేయడం అత్యంత ముఖ్యమన్నారు. సిసి నంబర్ల ప్రగతిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. కోర్టు సమన్లు, బెయిలబుల్ వారెంట్ల అమలు విషయంలో ఎటువంటి ఆలస్యం లేకుండా, కోర్టు ఆదేశాల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, వాటి అమలుపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాస్, సిఎంఎస్ ఎస్ఐ భాస్కరరావు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణకు సమిష్టి కృషి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

జిల్లాలో వినియోగదారుల హక్కులు, రక్షణ కోసం కౌన్సిల్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ సేఫ్టీ కింద ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారో, లీగల్ మెట్రాలజీ విభాగం పనితీరు ఎలా ఉందో అధికారులను ఆరా తీశారు. ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తూనికలు, కొలతల విషయంలో జరుగుతున్న మోసాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి రెండు విభాగాలు పరస్పర సహకారంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఒకేలాంటి ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, నీటి బాటిళ్లపై ద్వంద ధరలు వసూలు చేయడాన్ని అరికట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో స్టాంప్ చేయని తూకాలు, రాళ్లతో తూకం వేయడం వంటి వాటిపై లీగల్ మెట్రాలజీ అధికారులు దష్టి సారించాలని ఆదేశించారు. ఆహార భద్రతలో భాగంగా, ఆహార ధాన్యాలు, పప్పులు, పండ్లలో కల్తీని నిరోధించడం, చట్టాలను కఠినంగా అమలు చేయడంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, ఎఫ్ఎస్ఎస్ఎఐ రిజిస్ట్రేషన్ ప్రదర్శన, వినియోగదారులకు ఫిర్యాదు రిజిస్టర్ లభ్యత, ఉచిత తాగునీటి సౌకర్యంపై సమీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక ఛార్జీలు వసూలు చేయడాన్ని అరికట్టడం, గడువు ముగిసిన మందులు, నకిలీ మందుల అమ్మకాన్ని నిరోధించడంపై వైద్యారోగ్యశాఖ దృష్టిసారించాలని సూచించారు. నకిలీ, ధవీకరించబడని విత్తనాల అమ్మకం, విత్తనాలు, ఎరువుల ధరలు మించి వసూలు చేయడాన్ని అరికట్టాలని ఆదేశించారు. పండుగ సీజన్లలో ఆర్‌టిసి బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా పర్యవేక్షించడం, ఎల్‌పిజి రీఫిల్ డెలివరీ కోసం అధిక ధర వసూలు చేయకుండా చూడటం వంటి అంశాలపైనా దృష్టిసారించాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

2029 నాటికి ఇంటికో ఉద్యోగం

ప్రజాశక్తి - పాతపట్నం

2029 నాటికి ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన స్థానిక కిరణ్మయి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. జాబ్ మేళాకు మొత్తం 482 మంది యువతీ యువకులు హాజరు కాగా, వారిలో 301 మంది పలు కంపెనీలకు ఎంపికయ్యారు. డాక్టర్ రెడ్డీస్, రాయల్ ఎన్‌ఫీల్డ్, హెటిరో డ్రగ్స్‌తోపాటు సుమారు 11 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. ఇటువంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన వారు దూరభావం లేకుండా, లభించిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉద్యోగాల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో కిరణ్మయి విద్యాసంస్థల ఎమ్‌డి తూలుగు తిరుపతిరావు, ప్రిన్సిపాల్ జగన్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలోని సిద్ధాశ్రమంలో పంచలోహ విగ్రహాలు, ఇతర వస్తువుల దొంగతనం కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడు నరసన్నపేట పట్టణంలోని హడ్కోకాలనీకి చెందిన దుంపల సింహాచలం నుంచి రూ.1.40 లక్షల విలువ గల వస్తువులను రికవరీ చేసినట్లు చెప్పారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. నరసన్నపేట ఇందిరానగర్ కాలనీలోని సిద్ధాశ్రమంలో ఈనెల 18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఆరు పంచలోహ విగ్రహాలు, ఒక గంట, ఇత్తడి పళ్లెం దొంగిలించినట్లు సిద్ధాశ్రమ కార్యదర్శి ముద్దాడ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈనెల 24న నరసన్నపేట ఎస్ఐ శంకరరావు మండలంలోని తామరాపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, గోనె సంచితో వస్తున్న యువకుడు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. విచారణలో హడ్కో కాలనీకి చెందిన దుంపల సింహాచలంగా గుర్తించామన్నారు. నిందితుడు చోరీని అంగీకరించినట్లు తెలిపారు. నిందితునిపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. సమావేశంలో టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ శంకరరావు పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎఎస్‌పి శ్రీనివాసరావు

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com



అభినందిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల పోలీసు కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ఎంపికైన ఏడుగురు హోంగార్డులను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అభినందించి సన్మానించారు. ఎస్.నరేష్, ఎ.ఎర్రన్న, డి.హరికేశం, జె.వెంకటరమణ, జి.చిన్నారావు, సిహెచ్ సంజీవరావు, వై.తిరుపతిరావు కానిస్టేబుళ్లగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో తమ లక్ష్యాన్ని సాధించి పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇది జిల్లా పోలీసు శాఖకు గౌరవకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ గోపినాథ్, హోంగార్డు అర్ఎస్ఐ ఆర్‌వి రమణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఆవిష్కర్ హాకథాన్ – 2025' నిర్వహించబడుతోందని, దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఇది అద్భుత వేదికగా నిలుస్తుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ హాకథాన్‌లో ఆన్‌లైన్ ట్రాక్, ఆఫ్‌లైన్ (ఫిజికల్) ట్రాక్ ఉంటాయన్నారు. ఆన్‌లైన్ ట్రాక్ నవంబర్ 25న ప్రారంభమవుతుందని, నవంబర్ 20లోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. ఆఫ్‌లైన్ (ఫిజికల్) ట్రాక్ డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ఐతం క్యాంపస్‌లో 48 గంటల పాటు జరుగుతుందన్నారు. ఈ విభాగానికి నవంబర్ 25న రిజిస్ట్రేషన్ ముగియనుందన్నారు. ఈ కార్యక్రమం ఐతం ప్లస్ ఇన్క్యుబేటర్, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందన్నారు. ఈ హాకథాన్ ద్వారా యువ మేధావులు సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను ఆవిష్కరించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరీష్ కుమార్, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐతం రైజ్ సిఇఒ మనోజ్ కుమార్, భడఘాస్వల, డీన్ ఐఐసి డా. సతీష్ కుమార్, ఎం.సంతోష్ కుమార్, డా. డి.శ్రీరాములు, క్రాంతి కుమార్, ఎన్.హర్షిత తదితరులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా శుక్రవారం పరిశీలించారు. డొక్కా మాణిక్య సీతమ్మ నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వంట రుచులను ఆయన తనిఖీ చేశారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, విద్యార్థులకు సరఫరా విధానాలను సమీక్షించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశమై భోజన పథక అమలు, విద్యార్థుల హాజరు, ఇతర విద్యా సంబంధ అంశాలపై చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం పరంగా పథకం సమర్థవంతంగా అమలు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన

ప్రజాశక్తి- మందస

గత పదినెలలుగా మూతపడ్డ జీడి పరిశ్రమను తెరిపించాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జీడి కార్మికులు చేపట్టిన నిరసన రెండవ రోజుకు చేరింది. రాధాకృష్ణాపురం వద్ద గల సత్యసాయి క్యాష్యూ పరిశ్రమ ఆవరణలో జిల్లా జీడి కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరవదిక ధర్నా కొనసాగిస్తున్నారు. రెండవ రోజు ధర్నా శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కేశవరావు ప్రారంభించి మాట్లాడుతూ మందస కేంద్రంలో ధర్నాకు పర్మిషన్ ఇవ్వకుండా పోలీసులు అడ్డు చెప్పడంతో యాజమాన్యంకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని అర్ధమైందన్నారు. ఎన్ని ఆటంకాలు పెట్టినా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని జీడి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. పరిశ్రమ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని,



నిరసన తెలియజేస్తున్న జీడి కార్మికులు

పరిశ్రమ మూసివేసిన కాలానికి కార్మికులకు యాజమాన్యం వేతనాలు చెల్లించాలని, గతంలో చేసిన పనికి వేతనాలు ఇవ్వాలని, నూతన ఒప్పందంలో భాగంగా పెరిగిన కూలిరేట్లు ప్రకారం బకాయిలు, ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీడి సంఘం నాయకులు డి.మీన, డి.భారతి, బి.వరలక్ష్మి, కె.వరలక్ష్మి, టి. కుమారితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పాలనా సౌలభ్యంలో భాగంగా అందివస్తున్న సాంకేతికత పరిజ్ఞానంపై మహిళల్లో చైతన్యం పెంపొందింపజేయాలని నగరపాలక సంస్థ కమిషనరు పి.వి.వి.డి ప్రసాదరావు సూచించారు. స్థానిక రైతుబజార్ దరి పట్టణ మహిళా సమాఖ్య వనరుల కేంద్రంలో శుక్రవారం మన మిత్ర వాట్సాప్ సేవలపై మెప్మా సిబ్బందికి, సిఆర్‌పిలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల చెంతకే ప్రభుత్వసేవల లభ్యతతో జవాబుదారీతనం, పారదర్శక సేవలకు దోహదమ వుతుందన్నారు. అలాగే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా హోమ్ కంపోస్ట్, టెర్రస్ గార్డెన్ విభాగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు పొందడం సంతోషదాయకమని, ఈ గుర్తింపును కొనసాగేలా ఈకార్యక్రమాన్ని నగరపాలక సంస్థ పరిధిలో విస్తృతం చేయాలని కోరారు. పుర సేవ యాప్ ద్వారా పురపరిపాలన



మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

సేవల లభ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ యాప్ డౌన్లోడ్ చేసి వినియోగించుకునేలా చేయాలన్నారు. మెప్మా పీడీ ఎస్.వెంకటరావు మాట్లాడుతూ వీధి వ్యాపారుల అభివృద్ధికి చేపడుతున్న పిఎం స్వానిధి నమోదు, వివరాలసేకరణ, రుణాల మంజూరు ప్రక్రియ లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో జి.కిషోర్ బాబు, బి. రామారావు, వై.శారదావాణి పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా హరికృష్ణ

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఒగా హరికృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈయనను మండల సెక్రటరీ సంఘం ప్రతినిధులు రమణబాబు, సంతోష్ కుమార్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ తదితరులున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి

ప్రజాశక్తి- రణస్థలం

రోడ్డు విస్తరణ పనులకు వ్యాపారులు సహకరించాలని జె.ఆర్.పురం సిఐ ఎం. అవతారం, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ ప్రసాద్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం స్థానిక వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రణస్థలం మండల కేంద్రంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడుతున్న సందర్భంగా రోడ్డుపై ఉన్న వ్యాపారులు సోమవారం నాటికి ఖాళీ చేసి కేటాయించిన షాపుల్లోనికి వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారులు ఈవిషయంలో పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.

విద్యార్థులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని తలగం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు నిత్యవసర సరుకులను శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం పేడాడ అమ్మనమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ బొడ్డేపల్లి విద్యావతి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ద్వారా ప్రతినెల విద్యార్థులకు సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అవార్డు డైరెక్టర్ పి.అప్పారావు, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, తిరుపతిరావు, వీరాస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కవిటి: మండలం డొంకపుట్టుగ గ్రామానికి చెందిన డొంక సావిత్రి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం డయాలసిస్ చికిత్స పొందుతోంది. ఈమె ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండటంతో గ్రామంలోని అయ్యప్పస్వాములు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. స్వాములందరూ కలిసి రూ.10 వేలు సహాయంగా అందజేశారు. బాధితురాలు క్షేమంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బూరగాంలో రీ సర్వే

టెక్కలి: మండలంలోని బూరగాం రెవెన్యూ గ్రామంలో శుక్రవారం సమగ్ర భూసర్వే నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో భూముల సర్వేలో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మరలా రీసర్వే నిర్వహించాలని చేసిన సూచనల మేరకు ఈ రీసర్వే జరిగింది. తహశీల్దార్ కుమార్ ఆదేశాల మేరకు బూరగాంలో జరిగిన రీసర్వేపై రైతులు వినియోగించుకోవాలని కోరారు. విఆర్ఒ శ్యామ్ ఆధ్వర్యంలో ఈ బృందం సర్వేలో పాల్గొంది.



ఇఎస్‌ఐ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

ఇఎస్ఐపై అవగాహన

రణస్థలం: ఇఎస్ఐ కార్పోరేషన్, హెడ్ క్వార్టర్స్, న్యూఢిల్లీ ఆదేశాల మేరకు కొత్తగా ప్రవేశపెట్టిన ఇఎస్ఐ పథకాలపై పైడిభీమవరంలో అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విశాఖపట్నం ఉపప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాలు డిసెంబర్ వరకు అమల్లో ఉంటుందన్నారు. ఇఎస్ఐలో నమోదు కాని ఉద్యోగులు, కార్మికులు నమోదు చేసుకోవచ్చునన్నారు. నమోదు చేసుకుంటే ఇఎస్ఐ పథకం వర్తిస్తుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఇటువంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఎస్ఐ సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ పి. శ్రీనివాస్, విజయనరం బ్రాంచ్ మేనేజర్ జి.జీవరత్నం, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్ పి.నారాయణరావు, సుందర్, సత్యనారాయణ, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న రాజేష్

అగ్ని బాధితులకు సరుకులు వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడా కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాద ఘటనలో తీవ్రంగా నష్టపోయిన బాధితులను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ పరామర్శించారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నెలరోజులకు సరిపడే రేషన్ సరుకులను అందించారు. మున్సిపాలిటీ 23వ వార్డులో జనసేన కుటుంబ సభ్యులు సెట్టి ప్రసాద్, అనీల్ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. మంటల్లో గృహోపకరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సుమారు రూ.3 లక్షల విలువైన వెండి, కంచు, ఇత్తడి, ఫర్నిచర్స్ సామాన్లు మంటల్లో కాలి పూర్తిగా బూడిదయ్యాయి. మున్సిపాలిటీ జనసేన ఇన్‌ఛార్జి రోకల్ల భాస్కరరావు సమాచారం మేరకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు చీకటి కృష్ణయ్య, కవిటి మండల నాయకులు బైపల్లి దాలయ్య, జనసేన జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కదంబల ప్రశాంత్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న 11 నుంచి 14 సంవత్సరాల మధ్య హైస్కూలు విద్యార్థులకు ప్రపంచ శాంతి కొరకు అందరూ కలిసివుంటే ఎలా ఉంటుంది అని విషయంపై చిత్రలేఖనం పోటీలు వరం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం ఫౌండర్, ప్రెసిడెంట్ హారికాప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కొరకు జరిగే చిత్రలేఖనం పోటీ పిల్లల్లో సమాజంపై వారికున్న అవగాహన, నైపుణ్యాలను ప్రోత్సహించే చక్కటి కార్యక్రమం అని అన్నారు. చీఫ్ గెస్ట్ లయన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాంతిపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రసాద్, లయన్స్ క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం ప్రెసిడెంట్ డాక్టర్ మేసిసెట్టి సత్యస్వరూప్, సెక్రటరీ సత్యవరపు లక్ష్మణ్, ట్రెజరర్ జె ఎస్‌టి నాయుడు, సుమన్, సాయిబాబా, కీర్తి, సుశీల, వరంస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బూర్జ: చెక్కును అందజేస్తున్న ప్రమీల

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను మాజీ ఎంపిపి కూన ప్రమీల ఆయా గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ కృషితో మంజూరైన రూ.24 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, సంపదరావు మురళి, నాగళ్ల

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

మురళీధర్ యాదవ్, పి.వి.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని అల్లిన గ్రామానికి చెందిన గేదెల సుధీర్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సుధీర్ తల్లి గేదెల మౌలమ్మకు రూ.13 లక్షల చెక్కును మాజీ ఎంపిపి కూన ప్రమీల అందజేశారు. కార్యక్రమంలో గేదెల యోగేశ్వరరావు, ఏనుగుతల హరి, శంకర్రావుతో పాటు కుటుంబ సభ్యులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి గ్రామానికి చెందిన కూటికుప్పల ఢిల్లేశ్వరికి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.7 లక్షల చెక్కును మాజీ ఎంపిపి కూన ప్రమీల, కూన వెంకట సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతరావు, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు అరుణ, టిడిపి నాయకులు యుగంధర్, అప్పలనాయుడు, రామారావు, శ్రీను, రమణ పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎస్‌వి కళాశాలలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాలలో జిల్లా ఆస్పత్రి వైద్యులు తిమ్మిరి రమేష్ ఆధ్యర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి కంటికి సంబంధించిన పలు సూచనలు, జాగ్రత్తలు తెలిపారు. దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అన్నెపు ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్, మెట్ట మోహనరావు, కోసంటి శ్రీనివాసరావు, రమేష్ పర్యవేక్షించారు.

నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలి

నరసన్నపేట: నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి గృహవసతి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం కత్తిరివాని పేట క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐదులక్షల గృహాలను నిర్మించే దిశగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో గృహవసతి లేని నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సంబంధిత మండల గృహనిర్మాణ శాఖ అధికారులకు దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డుతో పాటు రేషన్‌కార్డు కూడా జతచేస్తూ నవంబర్ 5వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మతతత్వ మనువాద శక్తులను ప్రతిఘటిద్దాం



పోస్టర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, హామీలిచ్చిన కూటమి ప్రస్తుతం సంపదను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు అన్నారు. శుక్రవారం డిసెంబర్ 6, 7న కడపలో నిర్వహించే 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని, గతంలో గంగవరం పోర్టును మత్స్యకారులపై కాల్పులు జరిపి అదానీ కంపెనీకి అప్పచెప్పారని గుర్తు చేశారు. బాక్సైట్ గనులను జిందాల్ కంపెనీకి, కడప గనులను మిట్టల్ కంపెనీకి అప్పచెపుతున్నారని, అధికారం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్‌గా మిగిలిందన్నారు. మతోన్మాద శక్తులకు దన్నుగా ప్రోత్సాహం అందిస్తూ అధికార వర్గమే కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మహిళలపై అత్యాచారాలు, షెడ్యూల్ కులాలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, బిజెపిల మోడి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని క్రమక్రమంగా నిర్వీర్యం చేస్తూ వారి సొంత మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తామని మంత్రులే ప్రకటనలు చేస్తూ, ప్రజాపాలన కంటే కక్ష సాధింపు చర్యలకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ఏ రకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్షాల మీద దాడులు చేశారో ఇప్పుడు అదే పరిస్థితిని కొనసాగిస్తున్నారన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి బదులు అప్పులకు గ్యారంటీతో సరిపెట్టుకునే పరిస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో ఎఐకెఎం నాయకులు మద్దిల రామారావు, ఎఐసిసిటియు జిల్లా నాయకులు పోతనపల్లి కామేశ్వరరావు, పిన్నింటి నాగేశ్వరావు, కుత్తుం లోకనాథం, మహిళలు, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.



మందస : వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- మందస

మండల కేంద్రంలో వ్యాసరచన పోటీలను ఎంఇఒ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 22 జడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బి. శాలిని, కెజిబివి మందస, ఎం.అమృత, జెడ్‌పిహెచ్ఎస్ పొత్తంగి సిరిపురం, బి.లాస్య ఎస్ఆర్‌హెచ్ఎం విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఇఒ తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందితే అసెంబ్లీ సమావేశాల్లో బాల ఎమ్మెల్యేగా ఎమ్మెల్యేల పక్కన కూర్చుంటారని తెలిపారు.

ఇచ్ఛాపురం: మండలంలోని రాజ్యాంగ దినోత్సవం మండలస్థాయి పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు 16 ఉన్నత పాఠశాలల్లోని 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.. వీరిలో ముగ్గురు విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇందులో ప్రథమ స్థానంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కొత్తశాసనం విద్యార్థిని కె.స్నేహ, ద్వితీయ స్థానంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.దీక్ష, తృతీయస్థానంలో పురుషోత్తపురం మోడల్ స్కూల్ విద్యార్థి దీపక్ కుమార్ నిలిచారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు పి.భాస్కరరావు, ఎన్.రాజశేఖర్, బి నీలిమ, జె.శంకరరావు, హెచ్ఎం బి.శ్రీనివాస్, ఎం.అర్.సి సిబ్బంది, సిఆర్ఎంటిలు అర్. దేవరాజు, సోమేశ్వరరావు, సత్యనారాయణ, మోహనరావు, తులసీరావు, బి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని 12 జెడ్‌పి పాఠశాలలకు చెందిన 34 మంది విద్యార్థులు ఈనెల 26న రాజ్యంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు లావేరులో మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఇఒలు సమక్షంలో రాతపరీక్షలు నిర్వహించగా, ఆరుగురు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా అందులో ముగ్గురు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ తెలిపారు. అదపాక జెడ్‌పి పాఠశాల విద్యార్థి ఎల్ సాయికార్తీక్, మురపాక కెజిబివి విద్యార్థిని ఎ.చతుర, బుడుమూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థి వేదవర్శిత ఈనెల 29న నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. వీరిని ఎంఇఒలు అభినందించారు.

సామాజిక సేవలో బొడ్డేపల్లి సురేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న సన్‌రైస్ ఆస్పత్రి ఎండి బొడ్డేపల్లి సురేష్ సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు. 46వ పుట్టినరోజు శనివారం జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి తన సేవాకార్యక్రమాలపై మాట్లాడారు. వైద్య వృత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. 2015 నుంచి 2025 వరకు గ్రామీణ ప్రాంతాల్లో 800పైగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించానన్నారు. ప్రతి శనివారం ఆస్పత్రికి వచ్చే రోగులకు ఉచిత ఓపి, ల్యాబ్ టెస్ట్‌లకు 40 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు, ఆస్పత్రి ద్వారా బలహీన వర్గాల పిల్లలకు చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం వివిధ ప్రాంతాల్లో ఆస్పత్రి ద్వారా నిర్వహించడం జరిగిందని, సంక్రాంతి పండగ సందర్భంగా పేద వృద్ధులకు దుప్పట్లు, చీరలు వంటి వస్త్రా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించడానికి ఉచిత అవగాహన సదస్సులు వివిధ కళాశాలలో నిర్వహించామన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులుగా ఉన్న స్లమ్ ఏరియాలో ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత ఆహార పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు



వైద్య సేవలు అందిస్తున్న బొడ్డేపల్లి సురేష్

చెప్పారు. ప్రస్తుతం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌లో మానసిక ఆరోగ్య విభాగం డిస్ట్రిక్ట్ చైర్మన్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత ప్రజలకు తుపాన్ వచ్చే సందర్భంలో ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ వంటివి అందజేస్తూ సేవలు చేస్తున్నట్లు చెప్పారు. సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్, క్రీడాకారులకు జెర్సీలు, కిట్లు అందించామన్నారు. అలాగే ఆదివారం పేటలో ఉన్న సామాజిక భవనాన్ని ఆస్పత్రి సొంత ఖర్చులతో గ్రంథాలయంగా మార్చి ఆ ప్రాంతంలో ఉన్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. జై భీమ్ వైద్య క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆధ్యాత్మిక కార్య క్రమాల్లో చురుకుగా పాల్గొంటానన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- పలాస



మృతి చెందిన వృద్ధురాలు

మండలం గరుడఖండి, చిన బడాం గ్రామాల మధ్య పాత జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు (70) మృతి చెందినట్లు కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి రైల్వే గేటు తీసే సమయంలో అతి వేగంతో ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి గుర్తు తెలియని వృద్ధురాలకు బలంగా ఢీ కొట్టాడు. అయితే ఆ సమయంలో ద్విచక్ర వాహన దారుడుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడుకు సపర్యలు చేయడంతో వాహన దారుడు వెళ్లిపోగా అదే సమయంలో వృద్ధురాలు రోడ్డు పక్కన ఉన్న ముళ్ళపొదలో పడి పోవడంతో ఎవరు గుర్తించ లేదు. కొంత సమయానికి పొదల్లో వృద్ధురాలు పడి ఉండడం వాహన చోదకులు చూసి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఢీ కొట్టిన వ్యక్తి, మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

లారీని ఢీకొన్న మరో లారీ

ఎచ్చెర్ల: మండలం అరిణాం అక్కివలస పంచాయతీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో వెనుక లారీ డ్రైవర్



క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

గంది భవేష్ గాయపడ్డాడు. ఎచ్చెర్ల పోలీసుల వివరాల వివరాల ప్రకారం ఇసుక తీసుకెళ్లేందుకు విజయనగరం నుంచి ఖకాకుళం రెండులారీలు వస్తుండగా అరిణాం అక్కివలస వద్దకు వచ్చేసరికి ముందున్న లారీ ఒక్కసారి నిలుపుదల చేయటంతో వెనుక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అనకాపల్లి జిల్లా సబ్బవరం వద్ద మల్లునాయుడు పాలెంకు చెందిన భవేష్ గాయాలపాలయ్యాడు. బలంగా ఢీకొట్టడంతో క్యాబిన్‌నొక్కుకుపోగా డ్రైవర్ ఇరుక్కుపోయాడు. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సహాయం కోసం కేకలు వేసిన డ్రైవర్‌ను స్థానికులు క్రేన్ సహాయంతో బయటకు తీసి 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో భవేష్ కుడికాలు, తొడ, ఎముక విరిగిపోగా నుదిటిపై గాయాలయ్యాయి. ప్రమాదంలో రెండు లారీలు ఒకే వ్యక్తికి చెందినవి. ఎచ్చెర్ల పోలీసులు వివరాలు నమోదుచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్ గ్యాస్ లారీలో డీజిల్ చోరీ

ప్రజాశక్తి- కవిటి

భారత్ గ్యాస్ యజమాని వెంకటరావుకు చెందిన లారీలో మరోసారి డీజిల్ చోరీకి గురైంది. మండలంలోని కొజ్జిరియా వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద నిలిపి ఉంచిన భారత్ గ్యాస్ లారీ నుంచి రాత్రికి రాత్రి సుమారు 340 లీటర్ల డీజిల్ చోరీకి గురైందని లారీ యజమాని వెంకటరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం రేపింది. మూడు నెలల క్రితం ఇదే ప్రాంతంలో, ఇదే లారీలో 380 లీటర్ల డీజల్ చోరీ చేశారు. అప్పట్లో వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా ఇప్పటివరకూ దొంగతనం చేసిన వారి గురించి ఎటువంటి సమాచారం పోలీసులు బాధితులకు తెలియ జేయలేదు. మళ్లీ ఇప్పుడు 340 లీటర్ల డీజల్ చోరీ జరగడంతో వెంకటరావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం విశాఖ, పైడిభీమవరం నుంచి గ్యాస్ సిలిండర్లు తాము తీసుకురావడం చూసి ప్రణాళికా బద్దంగా చోరీ చేసినట్టు ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.38 వేలు, ఇప్పుడు రూ.34 వేలు విలువైన డీజిల్ చోరీకి గురైనట్టు వెంకటరావు తెలిపారు. ఈ సంఘటన గ్యాస్ కంపెనీకి ఆర్థికంగా భారంగా మారనుందని ఆయన వాపోయారు. ఇప్పటికైనా ఈ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుని నిందితులను గుర్తించాలని సిఐ చిన్నం నాయుడు, ఎస్ఐ రవివర్మను కోరారు.



ఆయిల్ చోరీ జరిగిన లారీ


వెరిఫికేషన్ చేస్తున్న సర్వేయర్ శ్యామలరావు

గృహాలు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పాత్రలోవ గ్రామ ప్రజలకు ప్రభుత్వం పిఎం జన్మన్ పథకం ద్వారా మంజూరు చేసిన కాలనీ ఇళ్లకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లు జారీకి మండల సర్వేయర్ శ్యామలరావు శుక్రవారం ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, మండల మాజీ వైస్ ఎంపిపి బైరిసింగి దినకర్‌రావు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పథకం అమలుపై సంతోషం వ్యక్తం చేశారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- నరసన్నపేట

ఇంటక్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆటలపోటీలకు తమ కళాశాల విద్యార్థినులు ఎంపికకావడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. శుక్రువారం కళాశాలలో విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడులో ఇంటక్ యూనివర్సిటీ నందు వినాయక మిషన్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి నవంబర్ 2 వరకు నిర్వహించిన కబడ్డీ పోటీలకు తమ విద్యార్థి బి.వాసవి ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ, ఫిజికల్ డైరెక్టర్ బోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉల్లాసంగా ఉత్సాహంగా...

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను ఉత్సాహంగా ఉల్లాసంగా సాధరంగా స్వాగతం పలుకుతూ ఒకరికొకరు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు డాన్సలతో ఆకట్టుకున్నారు. అంతకు ముందు విద్యార్థులను ఉద్దేశించి కళాశాల డైరెక్టర్ గేదెల కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కళాశాలలో చదివిన వారు ఉన్నత స్థాయిలో ఎంతో మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.సుధారాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జానకిరామ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

నిరుపేదలమైన తమ కుమారుడికి రావాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ ప్రభుత్వం వెంటనే ఇప్పించాలని జింకిభద్ర గ్రామానికి చెందిన షావుకారి జానకిరామ్ కోరాడు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తన ఆవేదన తెలియజేశాడు. తన కుమారుడు టెక్కలి ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు సంవత్సరాలు చదివాడని, ఒక్క ఏడాది కూడా ఫీజు రియింబర్స్‌మెంట్ రాకపోవడంతో పరీక్షలు రాసేందుకు కళాశాల యజమాన్యం అంగీకరించ లేదన్నారు. పరీక్ష రాసేందుకు తప్పనిసరి పరిస్థితిలో తాము నివసిస్తున్న ఇంటిని తాకట్టు పెట్టి కళాశాల ఫీజులు చెల్లించామని కన్నీటి పర్యాంతమయ్యాడు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే తమలాంటి ఎన్నో నిరుపేద కుటుంబాలకు న్యాయం జరుగుతుందని తెలిపాడు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్‌పి కె.వి. మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఎచ్చెర్ల పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఎఆర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎన్.శంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా ఉపయోగించే సాంకేతిక పరికరాలు, కమ్యూనికేషన్, బాంబ్ టెక్షన్ వివిధరకాల ఆయుధాలు, పోలీసు జాగిలాల పని తీరు, డ్రోన్స్ వినియోగం తదితర వాటిపై ప్రభుత్వ పాఠశాల, ఆక్స్ఫర్డ్, కేశవ రెడ్డి స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆదిలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ


డాక్టరేట్ స్వీకరిస్తున్న ఆదిలక్ష్మి

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళంలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న టి. ఆదిలక్ష్మికి ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఎపి ఆదాయ సృష్టి, సామర్థ్యంపై సమీక్ష, అధ్యయనం అనే అంశం మీద ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ గైడ్‌గా పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమెకు కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి


ఇచ్ఛాపురం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి 'ప్రజా ఉద్యమం' నియోజకవర్గ కేంద్రాల ర్యాలీపై ప్రజల్లో అవగాహన కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమంపై ప్రజల్లో విశేష స్పందన లభించిందని, గ్రామస్థాయిలో కూడా చేరే విధంగా ఈ నెల 28న ఎచ్చెర్ల మండలంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మండల అనుబంధ కమిటీలు, గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని వైసిపి మండల అధ్యక్షులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, వైసిపి మండల అధ్యక్షులు, అన్ని విభాగాల సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. గ్రామ దేవత ఆలయంలో ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, ఉలాల భారతీ దివ్య, లాబాల స్వర్ణమని, కుందేశీ ప్రియ, నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, వైసిపి మండల అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: మండలం బొంతు జంక్షన్ ప్రైవేట్ పంక్షన్ హాల్‌లో మాలువ, నవతల, ధర్మలక్ష్మీపురం క్లస్టర్ పెద్దలంబ, చిన్న కిట్టాలపాడు, మహాసింగి క్లస్టర్ పరిధిలో రచ్చబండ కార్యక్రమాన్ని యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 28న నరసన్నపేట పట్టణంలో జరగబోయే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, మండల అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, చైర్మన్ నక్క తులసీదాస్, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గెల్లంకి వెంకటరావు, రాష్ట్ర ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి జెన్ని అనిరుద్రుడు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఈనెల 28న జరగబోయే వైసిపి ప్రజాఉద్యమం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను టెక్కలి వైసిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ వైసిపి నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం జాయింట్ సెక్రెటరీ దుంపల శ్యామలరావు, మున్సిపల్ వార్డు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా మండలంలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన


రణస్థలం : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

కార్యక్రమం ఎచ్చెర్ల నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు ముద్దాడ రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బొట్ట ఉగాది యాదవ్, కోరాడ సతీష్ యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలలోని అమలపాడులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, పోతనపల్లి లింగరాజు, ఎంపిటిసి దున్న లోకనాథం, వైసిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, కార్యదర్శి జి. విశ్వనాథం, కారాడ గిరిబాబు, చిరంజీవి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: నగరంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలు డివిజన్‌లలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొండాల గణేష్, మొదలవలస రాజేంద్ర, దుంపల శ్రీనివాస్‌తో కూడిన బృందం ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరించారు.

సురక్ష యాప్‌తో కల్తీ కట్టడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వినియోగదారులకు నాణ్యమైన లిక్కర్ అందించేందుకు ప్రభుత్వం 'సురక్ష' యాప్‌ను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మద్యం కల్తీని అరికట్టడంలో ఈ యాప్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. నగరంలోని మద్యం దుకాణాన్ని శుక్రవారం పరిశీలించి, యాప్ ద్వారా మద్యం నాణ్యత తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం ప్రజల ప్రాణాలను హరిస్తోందని, అందుకే ప్రతిఒక్కరూ ఈ యాప్‌ను వినియోగించి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ యాప్ ద్వారా లిక్కర్ షాపుదారులు డిపో నుంచి వచ్చిన సరుకును షాప్ వద్దకే రాగానే స్కాన్ చేసి, కల్తీ లేని నాణ్యమైన ఉత్పత్తి వచ్చిందా అని నిర్ధారించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వినియోగదారునికి విక్రయించే ముందు లైసెన్సుదారుడు బాటిల్‌ను స్కాన్ చేసి 'గుడ్' అని చూపితేనే అమ్మాలని సూచించారు. వినియోగదారులు కూడా తమ వద్ద ఉన్న బాటిల్‌పై అనుమానం ఉంటే సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉత్పత్తి అసలైనదో లేదో తెలుసుకోవచ్చని తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

పుస్తకాలు చదవాలి

యువత పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బాపూజీ కళామందిర్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ప్రారంభించారు. యువత సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతూ అజ్ఞానం వైపు నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక, సాహిత్య, ఆరోగ్య రంగాలకు చెందిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

పశువైద్య శిబిరం ప్రారంభం



మద్యం సీసా క్యూఆర్ కోడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార మండలంలోని తూలుగులో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు సంరక్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలప్రదంగా మారాలని ఆకాంక్షించారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ పశువులను రక్షించుకోవాలని సూచించారు. లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- మందస

హరిపురంలో జెమ్స్ ఆస్పత్రి సూపర్ స్పెషాలిటి వైద్య బృందం సౌజన్యంతో ఉచిత కేన్సర్ వ్యాధుల నిర్ధారణ వైద్య శిబిరాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ శిబిరంలో ఫ్రీ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్, ఉచిత గుండె వ్యాధుల, వైద్య శిబిరం, ఫ్రీ కార్డియాలజీ స్క్రీనింగ్ క్యాంప్, ఉచిత కిడ్నీవ్యాధుల వైద్య శిబిరం, ఫ్రీ నెఫ్రాలజీ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ శిబిరంలో కొర్ల కన్నారావు, రాష్ట్ర కాళింగ డైరెక్టర్ భావన దుర్యోధన, రట్టి లింగరాజు, బైరి శెట్టి గున్నయ్య, అందాల రామారావు, ఎం.మాధవరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పోలియో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్ వద్ద రోటరీ క్లబ్ నిర్వహించిన వరల్డ్ పోలియో అవగాహన సదస్సు, ర్యాలీలో పాల్గొన్న జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐ మీసాల చిన్నం నాయడు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్ వెంకటేష్, కార్యదర్శి కాదా రామకోటి, రోటరీ ప్రతినిధులు దక్కత కృష్ణమూర్తి రెడ్డి, మధు, పైడిశెట్టి దినేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి- నందిగాం

విద్యార్థులు వినియోగదారుల రక్షణ చట్టం 2019పై అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం అన్నారు. శుక్రవారం నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.కస్తూరి అధ్యక్షతన వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వినియోగదారులేనని ఇప్పటినుంచి చట్టంలో ఉన్న హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. అలాగే తమ కుటుంబంలో సభ్యులకు, సమాజానికి వీటిపై విద్యార్థులే అవగాహన చేయాలన్నారు. వినియోగదారుల నష్టపోయేటప్పుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కుమార్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించేలా చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పదోతరగతి విద్యార్థులు ఒత్తిడి అధిగమించేలా ఉపాధ్యాయ బృందం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎంసి చైర్మన్ బమ్మిడి లక్ష్మీపతి కోరారు. శుక్రవారం నగరంపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం టి.హేమారావు అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థులు చదివేందుకు ముందస్తు ప్రణాళిక సరైన వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకొని ఒత్తిడిని అధిగమించేలా చేయడం ద్వారా రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాను ఢీకొని వ్యక్తి మృతి

సోంపేట: మండలం పాలవలస గ్రామానికి చెందిన తామాడ యాదవరావు (45) మృతి చెందాడు. మృతుడు యాదవరావు, ఆయన స్నేహితుడు కలిసి వస్తుండగా మృతుడు బైక్ వెనక కూర్చున్నాడు. వెనుక నుంచి వస్తున్న మ్యాజిక్ వ్యాను ఢీకొనడంతో ఆయనకు బలమైన గాయాలు తగడంతో టెక్కలి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మరణించినట్టు బారువా ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు.

తాగునీటి సమస్యలు అధికారులకు పట్టదా?


అధికారులను నిలదీస్తున్న మహిళలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో మగతపాడు పంచాయతీ పరిధిలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయంపై సంబంధిత అధికారులు పట్టించుకోరా అని మహిళలు ధ్వజమెత్తారు. శుక్రవారం అప్పారావుపేట గ్రామాన్ని సందర్శించిన అధికారులకు చింతాడ భారతి ఆధ్వర్యంలో మహిళలు నిలదీశారు. జలజీవన్ మిషన్ ద్వారా రెండు బోర్లు మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయక తాగడానికి నీళ్లలేక అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంచాయతీ సమస్య వలన ఎన్నికలు జరగక సర్పంచ్ లేరని, అధికారులు పట్టించుకోవడం లేదని తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లలేక సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాలని, వాటర్ బాటిళ్లుకొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఎంపిడిఒ జి.రవికుమార్ స్పందించి జలజీవన్ మిషన్ పనులు జరగక పోవడం వాస్తవమేనని, గతంలో ఈ పనులు నిర్వహణకు ఒకరికి ప్రభుత్వం టెండర్ ఇచ్చిందని, ఆయన పూర్తి చేయికుండా వెళ్ళిపోయారన్నారు. అవకాశం ఉన్నంత మేరకు పనులు పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, జెఇ శ్రీనివాసరావు, కార్యదర్శి ముకుంధరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని లక్కవరం, బేసి రామచంద్రపురం గ్రామాల్లో శుక్రవారం జిల్లా వనరులు కేంద్రం ఆధ్వర్యంలో పిఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం, ఆత్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ 2025 సీజన్‌లో వరి పంటలో మేలైన సాగు పద్ధతులను తెలియజేశారు. వరి రకాల ఎంపిక, సేంద్రియ ఎరువులు వాడకం, లాభాలు, ఎరువుల వినియోగం, కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్య రక్షణ, దోమపోటు నివారణ చర్యలు, రబీలో పెసర, మినుములు, నువ్వులు పంటలపై యాజమాన్య పద్ధతులను వివరించారు. ముఖ్యంగా వరిలో ప్రస్తుత దశలో సస్యరక్షణ సూచనలు క్షేత్ర సందర్శన చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సి.హెచ్ వెంకటరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు ఉదయ్, మధు కుమార్, వ్యవసాయ సహాయకులు మౌనిక, సౌజన్య, రైతులు పాల్గొన్నారు.


సోంపేట : రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

బూర్జ: రైతులు వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని ఆమదాలవలస శాస్త్రవేత్త కిరణ్ తెలిపారు. తోటవాడ, రామన్నపేట గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పిఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన శుద్ధి, సరైన రకాల ఎంపిక తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ ఎం.రేణుక సాయి, ఎంఎఒ డి.ఉషారాణి, గ్రామ వ్యవసాయ సహాయక సంచాలకులు పాల్గొన్నారు.

శాంతమనే ఆయుధంతోనే విజయాలు



మాట్లాడుతున్న ప్రతినిధులు

అరసవల్లి: కులమతాలు, మాతృ భాషలు వేరైనా మనమంతా ఒక్కటేనని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా.పైడి.సింధూర అన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు, స్థానిక భాష్యం పాఠశాలలో పీస్ పోస్టర్ పోటీలను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతి అనే ఆయుధంతో ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చని, కోపం వద్దు, శాంతే ముద్దని అన్నారు. కోపం అనర్థాలకు దారితీస్తుందని, శాంతం నిజా నిజాలను తెలుసుకునే అవకాశాన్ని మనందరికీ కల్పిస్తుందన్నారు. పీస్ పోస్టర్ కంటెస్ట్, జిల్లా చైర్మన్ ఎం.ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ఏ విషయంలోనూ తొందరపడొద్దని, శాంతియుతమైన జీవన విధానాన్ని అనుసరించడమే అన్ని విధాలా మంచిదన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లయన్స్ ఇంటర్నేషనల్ బహుమతులను అందించి, పాల్గొన్న ప్రతీ విద్యార్థికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్, రవీంద్రభారతి పాఠశాల డిఐ రమేష్, నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి టెక్కం.రామ్ గోపాల్, మెంటార్, జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, ఉపాధ్యక్షులు బి.ఉమా మహేశ్వరరావు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం

నరసన్నపేట: మారుతీనగర్‌లో గల శ్రీ జ్ఞాన జ్యోతి స్కూల్‌లో శుక్రవారం ఐక్యరాజ్యసమితి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చార్ట్ ఎగ్జిబిషన్, చార్ట్‌తో మారుతి నగర్ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి యొక్క ఆవిర్భావం, వాటి ప్రాముఖ్యత వివరించారు. జ్ఞాన జ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తత్ర సత్యనారాయణ, లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యుఎన్ఒ డే దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించగా కళాశాల ప్రిన్సిపాల్ ఉషాపద్మిని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కె. జగన్నాథరావు, చరిత్ర అధ్యాపకులు కె.బాలరాజు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు పి.అష్టలక్ష్మి, ప్రసాదరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల బారి నుంచి కాపాడాలి

ఆమదాలవలస: జనావాసాలు, రహదారులపై వీధికుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయని ప్రజాసంఘాల నాయకులు బొడ్డేపల్లి మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు వీధుల్లో తిరగడానికి భయపడే పరిస్థితి పట్టణంలో నెలకొందన్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పలువురిని గాయపరుస్తున్నాయన్నారు. ఈ సమస్యకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఆచరణయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వీధికుక్కల విషయంలో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


మెట్టక్కివలస రైల్వే క్వార్టర్స్ వద్ద గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఘనంగా ఎల్లమ్మ మండప ప్రతిష్ట

ప్రజాశక్తి- కవిటి

అగ్నికుల క్షత్రియ సేవా సంఘం (పెద్దవయ్యా) ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ ఎల్లమ్మ మండప ప్రతిష్ట మహోత్సవం, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకలో నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి కృష్ణ, పొల్లాయి సింహాచలం, పొల్లాయి దేవరాజు, దున్న పురుషోత్తం, పొల్లాయి ముకుంధరావు, బోగుతు సింహాద్రి, పి.కృష్ణారావు, ఈరోతు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న గణేష్

అటవీ హక్కుల చట్టంపై సదస్సు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక అటవీ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. భామిని, సీతంపేట మండలాలకు చెందిన రైతులకు అటవీ హక్కుల చట్టం – 2006, పొందిన హక్కులు, ఉమ్మడి అటవీ సంరక్షణ, హేబిటేట్ హక్కు, ఫారెస్ట్ సెటిల్మెంట్ భూ సమస్యలు సంబంధించిన వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతంపేట ఐటిడిఎ పిహెచ్ఒ గణేష్, వెలుగు సంస్థ సిఇఒ సంజీవరావు, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బి.క్రాంతి కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లలో వివిధ పాఠశాలలు, విద్యా సంస్థల్లో లైంగిక నేరాల నుంచి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, డిబేట్ పోటీలు శుక్రవారం నిర్వ హించారు. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్, అప్పారావు

పార్టీలకతీతంగా ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధి నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి అర్జీపై ఎమ్మెల్యే రవికుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, కార్యాలయ ప్రతినిధులు హనుమంతు నాగభూషణరావు, పి.వి.కె రాజు, టిడిపి నాయకుడు మాలిక్ పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

టెక్కలి రూరల్: డివిజన్ కేంద్రం టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న మాజీ సైనికుల కార్యాలయంలో ఆదివారం జరుగనున్న సమావేశానికి మాజీ సైనికులందరూ హాజరుకావాలని మాజీ సైనికుల అధ్యక్షులు నంబాల గోవిందరావు కోరారు. తమ సమస్యలు, పెన్షన్లు, పెండింగ్ సమస్యలపై చర్చించడం జరుగుతుందని, ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు. ఈయనతో ఎస్‌జి పట్నాయక్, నారాయణరావు ఉన్నారు.


మాట్లాడుతున్న గోవిందరావు